క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు



ఆటల పోటీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

పుంగనూరు: స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు నిర్వహించారు. సీడీపీఓ రాజేశ్వరి, ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 124 మంది మహిళలు ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. ప్రభుత్వాదేశాల మేరకు ఆటపాటలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బోధన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించడంతో ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరి తెలిపారు. దీని ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు నాణ్యమైన విద్య అందించనున్నట్లు తెలిపారు.

రవాణా బిల్లు ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న రవాణా బిల్లు కార్మికులకు ఉరితాడుగా మారుతుందని, దానిని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వాడ గంగరాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక బస్టాండ్‌లో ఆటోడ్రైవర్లతో కలసి సమావేశం నిర్వహించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది కార్మికులు దేశంలో పనిచేస్తున్నారని, ఈ బిల్లు ద్వారా వారి హక్కులు కాలరాయడంతో పాటు స్వేచ్ఛను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం వెంటనే రవాణా బిల్లును ఉపసంహరించుకోవాలని లేకుంటే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ఫార్మర్ ఐడీ నమోదుపై రైతులకు అవగాహన



అవగాహన ర్యాలీలో రైతులు, సిబ్బంది

గంగవరం: ఫార్మర్ ఐడీ కోసం సమీపంలోని రైతు సేవా కేంద్రంలో రైతులు భూమి పత్రాలతో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి హేమలత అన్నారు. శనివారం కీలపట్ల గ్రామంలో ఏపీఎఫ్ఆర్(ఫార్మర్ రిజిస్ట్రేషన్)పై రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఐడీ నమోదు చేసుకుంటేనే పథకాలకు అర్హులవుతారన్నారు. నెలాఖరులోపు నమోదు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి హేమలత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యా బోధన



రొంపిచెర్ల: శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పిల్లలకు విద్యా బోధన చేయాలని ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు అన్నారు. ఆయన శనివారం రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు రమణారెడ్డి, మనోహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సీఆర్‌పీలు అనసూయ, రాజేంద్ర, కిరణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బొమ్మయ్యగారిపల్లెలో చెత్త సేకరణ



చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

రొంపిచెర్ల: ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని రొంపిచెర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో కార్యదర్శి హరిబాబు శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వారంలో శని, ఆదివారాల్లో ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ పంచాయతీ సిబ్బంది వెళ్లి చెత్తను సేకరిస్తారని తెలిపారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి సంపద సృష్టిస్తామని ఈసందర్భంగా ఆయన తెలిపారు. చెత్తను డంపింగ్ యార్డ్‌లో ఎరువుగా తయారు చేసి తక్కువ ధరతో రైతులకు విక్రయిస్తామని తెలిపారు. ఎరువు విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఆయన చెప్పారు.

పడమట గొంతెండుతోంది!



ఎండిపోతున్న పుంగమ్మ చెరువు

- రిజర్వాయర్ల పనులు అడ్డుకున్న పచ్చ నేతలు
- హెచ్ఎన్ఎస్ నీరు లేక ఎండుతున్న చెరువులు
- వాటర్ గ్రిడ్‌ను రద్దు చేసిన ప్రభుత్వం
- అయోమయంలో స్థానికులు

పుంగనూరు: రానున్న వేసవిలో పడమట నియోజకవర్గమైన పుంగనూరు ప్రజల గొంతెండిపోతుంది. ముప్పై ఏళ్ల దాకా నియోజకవర్గంలో మంచి నీటి సమస్య లేకుండా ఉండేందుకు చేపట్టిన శాశ్వత తాగునీటి కష్టాలను తీర్చాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు రూ.1,820 కోట్లతో వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను పైప్‌లైన్ల ద్వారా ఇక్కడికి తరలించేలా ప్రణాళిక చేశారు. ఆ పనులు రద్దు కావడం, హంద్రీ–నీవా కాలువల్లో వరద నీరు వదలక పోవడంతో చెరువులు ఎండిపోతున్నాయి. ఏడాదిగా చెరువుల్లోకి నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని జనం వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు చెరువుల్లో హంద్రీ–నీవా నీటిని నింపడంతో రైతులకు మంచి నీటికి కొరత ఉండేది కాదు. ప్రస్తుతం చెరువుల్లోకి నీరు రాకపోవడంతో నీటి సమస్య తీవ్రమవుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

నాడు కళకళ..నేడు వెలవెల



నాడు నీటితో కళకళలాడుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు (ఫైల్)

పుంగనూరులో ప్రధాన చెరువులైన రాయలచెరువు, పుంగమ్మ చెరువు, సుబ్బమ్మ చెరువుల్లో వేసవి ప్రారంభంలోనే నీరు ఇంకిపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హెచ్ఎన్ఎస్ ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు, చెరువులకు నీటిని వదలడంతో నీటితో కళకళలాడిన చెరువులు నేడు నీరు లేక బోసిపోతున్నాయి. హంద్రీ–నీవా నీరు చెరువులకు వదలకపోవడంతో ఎండిపోతున్నాయి. వేసవి మొదలవడంతో ప్రజల్లో నీటిపై ఆందోళన రేకెత్తిస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా నీటి సమస్య లేకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం చెరువులు ఎండిపోతుండడంతో వేసవిలో నీటి సమస్యపై జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కొక్కరికి 130 లీటర్లు...

మున్సిపాలిటీలో 65 వేల మంది జనాభా ఉన్నారు. వీరికి ప్రతిరోజూ కొళాయిల ద్వారా 130 లీటర్ల నీటిని సరఫరా చేయాలన్నది నిబంధన. కానీ ప్రస్తుతం 70 లీటర్లు మాత్రమే ఒక్కొక్కరికి సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీలో 64 బోర్ల ద్వారా, 36 చేతి పంపులతో నీటిని ట్యాంకులకు తరలించి, రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేస్తున్నట్లు డీఈఈ మహేష్ తెలిపారు.

రిజర్వాయర్ల పనులకు బ్రేక్..

పడమట నియోజకవర్గాలైన పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతో పాటు అన్నమయ్య జిల్లా మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు కూడా తాగునీరు, సాగునీరు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,500 కోట్లతో నేతిగుట్లపల్లె, ఆవులపల్లెల్లో రిజర్వాయర్లను మంజూరు చేసింది. దీని ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టారు. ఇది చూసి ఓర్వలేని పచ్చ నేతలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, పెద్దిరెడ్డి కుటుంబానికి మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతో తప్పుడు ఆరోపణలతో గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి పనులపై స్టే తెచ్చి ఆపించారు. దీని కారణంగా రిజర్వాయర్లు నిరుపయోగం కావడంతో తాగునీరు – సాగునీరుకు కష్టాలు ప్రారంభమయ్యాయి.



నిరుపయోగంగా నేతిగుట్లపల్లె రిజర్వాయర్

వాటర్ గ్రిడ్ ప్రణాళిక ఇదే..

అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలను కలిపి వాటర్‌గ్రిడ్ పథకం తీసుకొచ్చారు. కృష్ణా జలాలు తరలించి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని కొళాయిల ద్వారా అందించాలని నిర్ణయించారు. రూ.2,400 కోట్లు మంజూరు చేయగా 2023 సెప్టెంబర్‌లో జరిగిన రివర్స్ టెండరింగ్‌లో రూ.1,825.68 కోట్లకు టెండర్ దాఖలై ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయ్యింది. ఒప్పందం ప్రకారం వైఎస్సార్ జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ వద్ద నిర్మించే వాటర్ రీట్రీట్ ప్లాంట్ నుంచి పైప్‌లైన్ ద్వారా మదనపల్లె బైపాస్‌రోడ్డు మీదుగా గంగమ్మ గుడి నుంచి పుంగనూరు నియోజకవర్గంలో నీటి సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. సముద్ర మట్టానికి 200 మీటర్ల ఎత్తులోని గండి జలాశయం నుంచి 664 మీటర్ల ఎత్తులోని అన్నమయ్య జిల్లాలోని మామిళ్లవారిపల్లె రీట్రీట్ ప్లాంటుకు 3.37 టీఎంసీల కృష్ణా జలాలను ఎత్తిపోసే భగీరథ ప్రయత్నానికి కూటమి బ్రేక్ వేసింది.

బాబుకు ప్రణాళికలు లేవు



అభివృద్ధిపై చంద్రబాబుకు నిర్దిష్టమైన ఆలోచన, ప్రణాళికలు లేవు. దీని కారణంగానే సమస్యలు తీవ్రమవుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం హంద్రీ–నీవా నీటిని సక్రమంగా చెరువులకు వదిలి ఉంటే నీటి సమస్య ఉండేది కాదు. వేసవి ప్రారంభంలోనే చెరువులు ఎండిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హెచ్ఎన్ఎస్ నీటిని చెరువులకు వదిలాం. దీని ద్వారా ప్రజలతో పాటు పశుపక్షాదులకు కూడా నీటి సమస్య లేకుండా చూశాం. ప్రస్తుతం నీటి సమస్య జటిలం కానుంది. నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే

నూతన వధూవరులకు ఆశీస్సులు



వీఎంఆర్ గార్డెన్స్‌లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: నూతన వధూవరులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం రాత్రి ఆశీర్వదించారు. రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లులో సమీపంలోని వీఎంఆర్ గార్డెన్స్‌లో జరిగిన పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీ బోనంవారిపల్లెకు చెందిన కేశవరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి వివాహ వేడుకలకు హాజరై వధూవరులు రాజశేఖర్‌రెడ్డి, జ్యోతిలను ఆశీర్వదించారు. అలాగే గానుగచింత గ్రామ పంచాయతీ లోకవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత బాబునాయక్ కుమార్తె వరలక్ష్మి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: చెడు అలవాట్లకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కానాలిండ్లు, గొల్లచీమనపల్లెలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆయన రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కోటీశ్వరులకు కొమ్ముకాస్తున్న కూటమి



మాట్లాడుతున్న చింతామోహన్

కుప్పం: కూటమి ప్రభుత్వం పేదలను విస్మరించి కోటీశ్వరులకు కొమ్ముకాస్తోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అభివృద్ధి శూన్యంగా మారిందన్నారు. కేవలం అమరావతి నిర్మాణానికే చంద్రబాబు రూ.60వేల కోట్లకు పైగా వెచ్చిస్తున్నారని విమర్శించారు. పేదల నివాసిత ప్రాంతాల్లో కనీసం రోడ్లు కూడా వేయడం లేదని మండిపడ్డారు. కోటీశ్వరులకు సౌకర్యంగా అమరావతి అభివృద్ధి కోసం రూ.వేల కోట్లు అప్పులు చేస్తున్నారన్నారు. వర్గీకరణ పేరిట ఎస్సీలను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాల, మాదిగల మధ్య చిచ్చు రేపుతున్న వర్గీకరణ ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. మిశ్రా కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈవీఎంలను మేనేజ్ చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారని, జర్నలిస్టులపై ఆంక్షలు విధించి వేధించడం దారుణమని ఆయన విమర్శించారు. ద్రవిడ వర్సిటీలో 200 మంది ఉద్యోగులకు ఏడాది నుంచి జీతాలు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి జీతాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ రవికుమార్

బైరెడ్డిపల్లె: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు పంచాయతీల వారిగా చేపట్టిన పనుల వివరాలను డ్వామా పీడీ రవికుమార్ వెల్లడించారు. ఉపాధి పథకం ద్వారా 1,614 పనులకుగాను రూ.7,32 కోట్లు, పీఆర్ సంబంధించి 29 పనులకుగాను రూ.2.40 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. అవినీతికి పాల్పడిన అధికారుల నుంచి రూ.1.33 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. మండలంలో అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు పుకార్లు వచ్చినా సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో బట్టబయలు చేయలేదని, తూతూమంత్రంగా నిర్వహించే గ్రామ సభలు ఎందుకని మండల ప్రజలు మండిపడ్డారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఏపీఓ హరినాథ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం రేపు

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఈనెల 24న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమ సలహాలు, సూచనలు సెల్ నంబర్: 91009 41850కు తెలియజేయాలని ఆయన కోరారు.

27న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సాధారణ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వేసవిలో తాగునీటి సమస్య, మార్చిలో జరగనున్న శ్రీసుగుటూరు గంగమ్మ జాతరకు సంబంధించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

26 నుంచి శైవ క్షేత్రాలకు ఆర్టీసీ సర్వీసులు

పుంగనూరు: స్థానిక డిపో నుంచి శైవ క్షేత్రాలకు ఆర్టీసీ సర్వీసులను ఈనెల 26 నుంచి నడుపుతున్నట్లు డీఎం సుధాకరయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెక్కుంది శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం, పెద్ద ఉప్పరపల్లె వద్ద గల దుర్గంకొండకు శివరాత్రి రోజున ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక బస్టాండు నుంచి ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

పలమనేరు: పట్టణంలో అంబేడ్కర్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని మాలల జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకుమార్, కత్తి శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు చాలా మంది యువత దురలవాట్లకు బానిసలుగా మారారని, ఇలాంటి వారు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను చదువుకుంటే బాగుపడతారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దీని ఏర్పాటుపై చొరవ చూపాలని అందులో కోరారు.

మునుస్వామికి నివాళి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

సదుం: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్ మునుస్వామినాయుడు (86) అనారోగ్యంతో హైదరాబాదులో మృతిచెందారు. ఈనేపథ్యంలో ఆయన శిష్యులు, గ్రామస్తులు గ్రామంలో ఆత్మశాంతి కోసం శనివారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి ఉన్నారు.

పక్షపాతం చూపకుండా సేవలందించండి



సమావేశంలో ప్రజాప్రతినిధులు,అధికారులు

వి.కోట: ప్రభుత్వాలు వస్తుంటాయి, మారుతూ ఉంటాయి. అధికారులు శాశ్వతం. పక్షపాతం చూపకుండా ప్రజలకు సేవ చేయండి. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి ప్రజాభివృద్ధికి కట్టుబడి ఉండాలని మండల అధికారులకు ఎంపీపీ యువరాజు సూచించారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ యువరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం మండల అధికారులు చూపుతున్న ఏకపక్షధోరణిపై ఎంపీపీ మండిపడ్డారు. అధికారులు ప్రజల అభివృద్ధికి కృషిచేయాలి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయరాదని, అర్హులందరికీ అవకాశాలను కల్పించి పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. మండలంలో చాలా వరకు చెరువులు ఎండిపోవడంతో గ్రామాల్లో తాగు నీటి కొరత ఏర్పడిందని, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో బోరు బావులు తవ్వి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించడంలో అధికారులు జాప్యం చూపడం సరికాదన్నారు. బైరుపల్లి, కుంబార్లపల్లి పలు చెరువుల్లో కూటమి నేతలు మట్టి తోడుకున్నా పట్టించుకోని అధికారులు, వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు సొంత భూముల కోసం ట్రాక్టర్లతో మట్టిని తీసుకుంటే అడ్డుకోవడం సరికాదని నిలదీశారు. అనంతరం ఆయా శాఖాపరమైన నూతన పథకాలు, జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను తెలుకుని, పరిష్కార మార్గంగా చర్చలు జరిపారు. మండల అభివృద్ధి అధికారి ఈశ్వరన్, డిప్యూటీ తహసీల్దార్ జ్ఞానేశ్వర్, వైస్ ఎంపీపీలు తమీమ్‌ఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పారిశుధ్యం ఆవశ్యకతపై అవగాహన



చప్పిడిపల్లెలో చెత్త సేకరిస్తున్న అధికారులు

బైరెడ్డిపల్లె: పారిశుధ్యం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉన్నప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం అన్నారు. మండలంలోని చప్పిడిపల్లె, నెల్లిపట్లలో శనివారం ఇంటింటికీ చెత్త సేకరించి ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తసేకరణ, చెత్తను విభజించడం అంశాలపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ ప్రసాద్, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు సదాశివయ్య, బాలాజీ, మహేష్, నాగరాజు, రాజశేఖరాచారి పాల్గొన్నారు.

వైభవంగా పుష్పపల్లకి



పల్లకీలో కొలువుదీరిన స్వామివారు

వి.కోట: పట్టణంలో వెలసిన వీరాంజనేయస్వామి పుష్పపల్లకీ సేవ శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు వైభవంగా సాగింది. పుష్పపల్లకీ పురస్కరించుని ఉదయం నుంచి వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, రాత్రి ఊరేగింపు కార్యక్రమం పురవీధుల్లో విశేషంగా కొనసాగింది. ఈ సందర్భంగా స్వామి వారిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకున్నారు. పల్లకి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. టీటీడీ ఆస్థాన విద్వాంసుల వాయిద్య కచ్చేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చింతచెట్టుకు నిప్పు



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద మెయిన్ రోడ్డు సమీపంలోని ఓ చింతచెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న వృక్షాన్ని ఎవరో కావాలనే కాల్చారని స్థానికులు తెలిపారు. మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బందికి అక్కడున్న వారు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్మేసిన మంచు



శాంతిపురం మండలంలో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఒక్కోసారి 16 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉదయం 8.30 వరకు పొగ మంచు తెరలు కమ్మేస్తున్నాయి. ఈ క్రమంలోనే పగటి పూట 33 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో పట్టు, పౌల్ట్రీ పరిశ్రమలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ మేరకు శనివారం ఉదయం దట్టంగా మంచు కురుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు కనిపించక లైట్ల వెలుతురులోనే రాకపోకలు సాగించారు. – శాంతిపురం

జ్ఞానజ్యోతి శిక్షణ తనిఖీ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఇంద్రాణి శనివారం తనిఖీ చేశారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ జరుగుతుందని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను ప్రీ ప్రైమరీలో బోధించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, ఆర్‌పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో ఇంద్రాణి